# హృదయములో పాపభీతి, దైవప్రీతి నింపుకోవాలి

ప్రేమస్వరూపులారా!

**చిత్తశుద్ధిగల మానవునకు సర్వజ్ఞానము తనంతట తానే సమకూరుతుంది**

మానవ శరీరము చాలా దుర్లభమైనది. కనుక, మానవుడు దీనిని ధర్మమయము గావించటమే తన పవిత్ర కర్తవ్యమని గుర్తించాలి. ఇది ఆధునిక యుగము, సాంకేతిక, విజ్ఞానశాస్త్రములు విలసిల్లునట్టి కాలము. ప్రతి మానవుడు తాను ఒక్కడే అయినప్పటికిని నిత్యజీవితములో అనేకవిధములైన కార్యకలాపములలో తాను పాల్గొనవలసివస్తుంది. ఇది అందరికీ తెలిసిన విషయమైనప్పటికిని దానిని అంతగా లక్ష్యపెట్టటం లేదు, యీనాటి మానవులు. దైనందిన జీవితమునుబట్టి ఒకే మానవుడు ఒక్కొక్కరి దగ్గర ఒక్కొక్క విధముగా ప్రవర్తించవలసివస్తుంది. ఒక దగ్గర తాను ఒకరికి కుమారుడు కావచ్చు, ఇంకొకరికి తండ్రి కావచ్చు, మరొకరి భర్త కావచ్చును, ఇంకొకరికి అధిపతి కావచ్చును. ఒక దగ్గర గురువు, మరొకరికి దగ్గర శిష్యుడుగా ప్రవర్తించవలసి వస్తుంది. ఈవిధముగా ప్రవర్తించడములో ఒకే మానవుడు అనేక అవతారములతో వివిధ సందర్భాలకు తగినట్టుగా తన జీవితాన్ని వ్యవహరింపజేసుకుంటాడు. భార్యదగ్గర భాషించు సమయములో తన భాషా శైలిని, మానసిక పరివర్తనను ఒక రీతిలో ప్రదర్శిస్తాడు. అదే వ్యక్తి తన తల్లిదగ్గర భాషించు సమయమునందు తనయొక్క మానసిక పరివర్తన, ప్రవర్తన, పదములయొక్క తీరు వేరుగా కనిపిస్తుంది. అదే వ్యక్తి తన మిత్రుని దగ్గర, శత్రువు దగ్గర వేరువేరు రీతులుగా ప్రవర్తించి తనయొక్క భాషను వేరు విధములుగా ఉపయోగిస్తుంటాడు. మనిషి ఒక్కడే అయినప్పటికిని తన భాషయందు, ప్రవర్తనలయందు వివిధ రీతులుగా ప్రవర్తించటములో అంతరార్థము ఏమిటి? దీనినే మానసిక వాతావరణము లేక ఎన్వైర్న్‌మెంట్ అంటారు. మానవునియొక్క విలువనేకాక, మానవునియొక్క వాతావరణమును పురస్కరించుకొనికూడా ఈవిధముగా ప్రవర్తించవలసివస్తుంది, వ్యవహరించవలసివస్తుంది. వివిధ స్థానములందు, వివిధ

sri sathyasai vahini amrutam

వ్యక్తులతో వ్యవహరించే సమయంలో తన ప్రవర్తనను అనేక రీతులలో మార్చుకొనవలెనన్న దీనికి విచక్షణా జ్ఞానము అత్యవసరము. ఈవిధమైన విచక్షణాజ్ఞానమునకు చిత్తశుద్ధి అవసరము. చిత్తశుద్ధిగల మానవునకు సర్వజ్ఞానము తనంతటతానే సమకూరుతుంది. ఈ చిత్తశుద్ధిని పోషించుకునే నిమిత్తమై దైవప్రీతి, పాపభీతి ప్రధానమైన అంశములుగా చూచుకోవాలి. పాపభీతి, దైవప్రీతి ఏ సమయమునందు, ఏవిధమైన పరిస్థితులలో మనము ఉపయోగించు కోవలెనని మీకు సందేహము కలుగవచ్చు. దీనికి శంకరులవారు చక్కని జవాబునందించారు. 'యోగరతోవా, భోగరతోవా, సంగరతోవా, సంగవిహీనః యస్య రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ' అన్నారు. యోగరతోవా, సంగరతోవా సంయోగమునందును వియోగమునందును, దారిద్ర్యమునందును భాగ్యమునందును, వ్యవహారమునందును వ్యవసాయమునందును, వ్యాపారమునందును రణరంగము నందును, ఒకటేమిటి సర్వకాలసర్వావస్థలయందును పాపభీతి, దైవప్రీతి ఈ రెండింటిని ప్రధానముగా అనుసరించాలి. ఈ రెండింటియొక్క ఆధారముచేతనే మానవుడు సక్రమమైన మార్గమున నడవటానికి వీలుంటుంది.

**సమాజములో ప్రతి ఒక్కరు తమ విద్యుక్త ధర్మమును సక్రమంగా నిర్వహించినప్పుడు అవినీతి అంతమవుతుంది**

ఒక వ్యాపారి పాపభీతి, దైవప్రీతితో ప్రవర్తించి తనయొక్క నిత్యకృత్యములు నిర్వర్తించుకొన్నప్పుడు సమాజములో యేవిధమైన అలజడులుగాని, అశాంతిగాని ఉండదు. అక్రమచర్య, అక్రమనిల్వ, నల్లబజారు, స్మగిలింగ్ యిత్యాది దుశ్చర్యలు వ్యాపారమునందు వుండుటకు వీలుకాదు. వ్యాపారి, తన భాగస్థులు, డాక్టర్లు, లాయర్లు, న్యాయాధిపతులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయవేత్తలు, అధ్యాపకులు తమయొక్క విద్యుక్త ధర్మములు సక్రమముగా పాటించినప్పుడు అవినీతి అంతర్థానమవుతుంది. అవినీతి నిర్మూలము కావలెనన్న ఎవరెవరి భాగమును, ఎవరెవరి కర్తవ్యాన్ని వారు సక్రమంగా నిర్వర్తించవలసి వస్తుంది. ఈ విధంగా కర్తవ్యమును నిర్వర్తించడమే వ్యాల్యూ అంటారు. తమయొక్క పనులను తాము తమ విద్యుక్త ధర్మముగా విశ్వసించి ఆచరించటము ప్రధానవిషయము,

srisathyasaivachanamrutam

వ్యాపారమునందు. దీనికే అన్ని మతములవారు, అన్ని దేశములవారు, అన్ని తెగలవారుకూడను ప్రార్థన అనే ఒక పవిత్రమైన సూత్రాన్ని నియమించుకుంటూ వచ్చారు. ఒక చిన్న ఉదాహరణము, ప్రతి వ్యక్తి కూడను గుర్తించే ఉండవచ్చును. ఒక జడమైన యినపముద్ద వంటిది, లారీ. కాని, దానిని డ్రైవ్ చేయవలెనంటే ఆ డ్రైవరు మొట్టమొదట ఆ స్టీరింగుకు నమస్కరించి డ్రైవింగు మొదలు పెడతాడు. వ్యవసాయదారుడుకూడను మొట్టమొదట తన నాగలికి నమస్కరించి తాను వ్యవసాయము ప్రారంభిస్తాడు. వ్యాపారస్థుడు తనయొక్క త్రాసు, తూకపు రాళ్లకు మొట్టమొదట నమస్కరించి తెల్లవారుతూనే ప్రారంభము చేస్తాడు. ఇంక విద్యావంతులు గ్రంథాలకు నమస్కారము చేస్తారు. గాయకులు హార్మోని, తబలా, వీణ, మృదంగము మొదలగు తమ వాయిద్యములకు నమస్కరించి తమ కృత్యములు ప్రారంభిస్తారు. ఒక నర్తకి, నర్తనకు పూర్వము తన కాలి గజ్జెలకు నమస్కరించి తదుపరే నర్తన ప్రారంభిస్తుంది. ఈవిధముగా నమస్కరించి ప్రారంభించటములో ఉన్నటువంటి అంతరార్థము ఏమిటి? తాను మున్ముందు గావించవలసిన కర్మలయందు ఏవిధమైన అభ్యంతరములు లేక ఆటంకములు జరుగక దిగ్విజముగా విజయము సాధించాలని. ప్రార్థన చేయటంచేత తనయొక్క కర్తవ్యాన్ని చక్కగా సాధించవచ్చునే విశ్వాసము.

### ప్రార్థనయందు ఎంతో పవిత్రమైన శక్తి ఇమిడియున్నది

ప్రార్థన చేయటంచేత యేవిధమైన యిబ్బందులు కలుగక, కష్టములు, నష్టములు సంప్రాప్తముగాక శాంతి, సౌఖ్యములతో తన కార్యములో విజయము సాధించవచ్చునని విశ్వాసము. ప్రార్థనలో ఎంత పవిత్రమైన శక్తి యిమిడి వుంటున్నది! గజనీమహమ్మద్ ప్రార్థనా సమయము ఆరంభము కాగానే తాను గుఱ్ఱము దిగి, పరివారముతో సహా నేలపై కూర్చొని ప్రార్థన సల్పేవాడు. నెపోలియన్‌కూడ తన కాలాన్ని సక్రమమైన రీతిలో అనుభవించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించటంలో ఆదర్శప్రాయుడుగా తయారయ్యాడు. ఈవిధముగనే వ్యాపారరంగమందు అందరూ సమష్టి ప్రార్థన సల్పినప్పుడు ఆ సంస్థలో దినము ఆనందమైనదినముగా అనుభవిస్తారు. ఈనాడు కంపెనీలయందుగాని,

sri sathyasai vahini vacharamrutam

ఫ్యాక్టరీస్‌యందుగాని ఈవిధమైన ప్రార్థన కనిపించటం లేదు. వ్యాపార సంస్థలలో, కర్మాగారాలలో, కార్యాలయములలో దైనందిన కార్యకలాపాలు ప్రార్థనతో, ప్రశాంతమైన చిత్తముతో ప్రారంభించుట లేదు. కనుకనే, తెల్లవారి మొదలు రాత్రి పరుండినంతవరకు అందరూ మానసిక అలజడులతో అశాంతిని అనుభవిస్తున్నారు. కనుక, ప్రతి మానవునికి తన కర్తవ్యకర్మలు నిర్వర్తించుటకు పూర్వము ప్రార్థన అత్యవసరమైన ఆయుధముగా తీసుకోవాలి. ఇక్కడ శబ్దతరంగములనేవి చాలా విరివిగా ప్రసరిస్తూ ఉంటాయి. ఇదియే ప్రాకృతమైన వాతావరణము. ఈవిధమైన శబ్దతరంగములు విద్యుత్ తరంగములతోకూడి అశాశ్వతమైన స్థాయినుండి శాశ్వతమైన స్థాయికి చేరిపోతున్నాయి. తద్వారా జ్యోతిర్మయమైన స్థితిని పొందుతున్నాయి. ఈ జ్యోతినుండియే విద్యుత్ శక్తి ప్రారంభమవుతుంది. ఈ విద్యుత్ శక్తిని ఆధారము చేసుకొని శబ్దములు ఎన్నివిధములైన అద్భుతములనైనా చేయటానికి అవకాశము వుంటున్నది. ఒకే ఒక వ్యక్తి వివిధ స్థానములందు కోట్లాది ప్రజలను అనేక రీతులలో ఒకే శబ్దముచే ఆనందింపజేసే శక్తిని కలిగి ఉంటాడు. ఇది ఎట్లనగా ఢిల్లీ లోపల ఆకాశవాణిలో ఒక వ్యక్తి ఒక ప్రోగ్రామును ప్రసారము చేస్తూ ఉన్నాడు. ఆ వ్యక్తియొక్క శబ్ద తరంగములు ఏవిధమైన మార్పు లేకుండా వివిధ దేశాలలో, వివిధ ప్రాంతాలలో కోటానుకోట్ల గృహములందు, అదే వ్యక్తి మాట్లాడినట్లుగా అందరూ అనుభవిస్తున్నారు. దీనికి కారణము ఏమిటి? ఇది శబ్దతరంగములు విద్యుత్ తరంగములతో లీనమై ఉండడమే! ఈ విద్యుత్ రంగములతో చేరటంచేత సర్వత్రా వ్యాపించిపోతున్నాయి. నీవు విన్ననూ, వినకపోయిననూ ఈ శబ్ద తరంగములు సర్వత్రా వ్యాపించియే ఉంటున్నాయి. దీనికి మరొక ఉదాహరణము. న్యూటన్ భూమియొక్క ఆకర్షణ శక్తిని గుర్తించి ప్రపంచానికి వెల్లడి చేశాడు. అతను వెల్లడిచేయక పూర్వముకూడను ఈ భూమికి ఆకర్షణశక్తి ఉండనే ఉన్నది. అదేవిధముగా మనము రేడియోద్వారా విన్ననూ, వినకపోయిననూ ఆశబ్ద తరంగములు సర్వత్రా విద్యుత్‌శక్తితో కలసి వ్యాపించి ఉంటున్నవి. అదేవిధముగా మనము ఈనాడు చేసే ప్రార్థన శబ్దతరంగములుగా బయలుదేరి విద్యుత్‌తోకూడి సర్వత్రా వ్యాపించి దేశ శాంతికి, దేశ సౌభాగ్యమునకు ఎంతైనా అవకాశమునందించే వీలున్నది.

sri sathyasai vahini

## భారతీయ వ్యాపార సంస్థలందు భారతీయ సంస్కృతి మరియు విలువలను కొంతవరకు సమన్వయం చేసుకోవాలి

మనము క్రమబద్ధముగా క్రమశిక్షణ పాటించి నియమముతో కొన్ని కర్మలు ఆచరించినప్పుడు ఈ కర్మలయొక్క ప్రభావము మానవులయందు యెంతైనా గోచరమవుతుంది. సర్వసామాన్యముగా ఈ జగత్తునందు దివ్యశక్తిని వినియోగించుకునే విధానమునందు కొంతవరకు తాత్కాలికమైన ప్రజ్ఞాశక్తిని మాత్రమే కలిగి ఉంటుంటారు. ఒక చిన్న ఉదాహరణము. మనము చీకటినుండి దూరమై వెలుతురు అనుభవించాలనుకున్నప్పుడు ఒక స్విచ్ ఆన్‌చేస్తే వెలుతురు వస్తుంది తద్వారా మనము వెలుతురును అనుభవిస్తాము. దీనికి సామాన్యమైన ప్రజ్ఞ చాలు. ప్రతి మానవుడు సులభముగా తెలుసుకొనగలడు. మనకు ఈ దీపము అవసరం లేదంటే స్విచ్ ఆఫ్ చేయవచ్చును. మన దైనందిన కార్యకలాపములలో మనము అనుభవించే సామాన్య ప్రజ్ఞకు ప్రత్యేకించి శ్రమ పడనక్కరలేదు. ఉదాహరణకు, ఒక ప్రత్యేకమైన ప్రజ్ఞ కలిగినవాడే ఎలక్ట్రిక్ స్విచ్‌ని ఉపయోగించాలి అనే నిబంధన యేమాత్రము లేదు. ఎప్పుడైనా ఇందులో సాంకేతిక లోపము కలిగినప్పుడు దీని కీలకాన్ని గుర్తించి సరిజేసేవాడు ఒకడు వేరే ఉంటాడు. అతనినే మెకానిక్, ఇంజనీరు అంటారు. అతను దాని కీలకాన్ని చక్కగా గుర్తించి దాని పరిస్థితిని సరైన మార్గములో పెట్టేటువంటి శక్తి కలిగివుంటాడు. అదేవిధముగా ప్రతి మానవునియందు కూడను సామాన్యమైన ప్రజ్ఞ సర్వవిధముల వ్యాపించి వుంటుంది. అదేవిధముగ మన ఎం.బి.ఎ. లోపల ఎక్కౌంట్స్, స్టాటిస్టిక్స్ యిత్యాది అంశములు సర్వసామాన్యముగా అన్ని దేశములందు సమానముగానే వుంటాయి. కాని, కొన్నికొన్ని అంశములు మాత్రము కొన్నికొన్ని దేశములకు కొన్నికొన్ని కాలములకు మాత్రమే పరిమితమై వుంటాయి. దీనిని గుర్తించటము ఈనాడు వ్యాపార రంగమునకు అత్యవసరము. మన భారతదేశమునకు భారతీయ సంస్కృతిని, భారతీయ విలువలను కొంతవరకు సమన్వయము చేసుకోవాలి.

## సంస్కరింప జేసేదే సంస్కృతి

సంస్కృతి అనగా ఏమిటి? సంస్కరింపజేసినదే సంస్కృతి. పూర్వము ఉండినటువంటి

sri sathyasaivachanamrutam

వస్తువును మనకు ఉపయోగపాత్రంగా, అనుకూలంగా మార్పు గావించుకొని దాని విలువను అధికము చేసుకోవడమే సంస్కృతి. ప్రపంచములో ఏ పదార్థమునైనా సంస్కరింపక మనము అనుభవించుటకు వీలుకాదు. ప్రత్తి ఉన్నది. ఈ ప్రత్తి విత్తనములతో కూడి వుంటున్నాది. అది తక్కువ విలువ గలిగి వుంటున్నాది. కాని, ఆ ప్రత్తినుండి విత్తనము వేరుచేసి, ఆ ప్రత్తిని దారముగా తీసి, ఆ దారమును వస్త్రముగా చేసినప్పుడే వస్త్రము మనకు వినియోగమవుతుంది. పూర్వము ప్రత్తికి వుండిన విలువకంటె ఈ వస్త్రమునకు విలువ ఎన్నో రెట్లు అధికమైపోయింది. రూపనామముల విలువ అధికమవుతుంది. కనుక, విలువలేని పదార్థమును విలువ గలిగిన పదార్థముగా సంస్కరించి వినియోగించుకోవడమే నిజమైన సంస్కృతి. వడ్లు పండించాము మనము. కాని, పండించిన వడ్లు అట్లనే మనము భుజించుటకు వీలుకాదు. ఆ వడ్లయందున్న (హస్క్) పొట్టును వేరుచేసి దానిని అన్నముగా పక్వము చేసినప్పుడే దానిని భుజించుటకు సరైన స్థితి వస్తుంది. ఒక వడ్లమూట వంద రూపాయలు కావచ్చును. కాని, అదే సంస్కరింపబడిన బియ్యపు మూట నాలుగు వందల రూపాయల విలువ వుంటుంది. ఈ నాలుగు వందల రూపాయలు విలువ రావటానికి చేసిన సంస్కారమే దీని విలువ ఎక్కించింది. కనుక, ప్రతి వస్తువునకు విలువ చేకూర్చాలి. ఈ విలువను అందించినప్పుడే మనయొక్క వినియోగము కూడను చక్కగా జరుగుతుంది. ఈ వ్యాల్యూనే మన సంస్కృతియందు గోల్ ఆఫ్ లైఫ్ అంటారు. దీనినే చతుర్విధ పురుషార్థములతో కూడిన జీవితము అన్నారు. ఇవే ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ఇవి భారతీయ సంస్కృతియందు ప్రధానమైన సూత్రములు.

## భారతీయ సంస్కృతికి నీతి, నిజాయతీలే సరైన విలువలు

ధర్మమనగా ఏమిటి? 'ధారయతీతి ధర్మః' అన్నారు. అనగా అన్నింటిని ధరించినది ధర్మము. ఇది అందరికీ అంత సులభంగా అర్థముకాదు. ఒక్కొక్క పదార్థమునకు ఒక్కొక్క విలువైన క్వాలిటీ ఉంటుంది. ఈ ప్రపంచమంతయు ధర్మముపై ఆధారపడి ఉన్నదని ఉపనిషత్తులు, వేదములు, ఇతిహాస పురాణములు కూడను ప్రబోధిస్తూ ఉంటాయి. ధర్మముయొక్క స్వరూపాన్ని నిరూపించటం కష్టం. ఏ వస్తువునకు ఏది ప్రమాణమైన

sri sathyasai vahini vachanamrutam

ప్రాణమో, ఆ వస్తువుకు ఆ ప్రధానమైన ప్రాణమే లేకపోయిన ఆ వస్తువు మరొక వస్తువుగా రూపొందుతుంది. ఒక ఉదాహరణ. అగ్ని తీసుకోండి. ఈ అగ్నికి దహనశక్తి స్వభావము. తేజస్సు అందించటము దాని స్వభావము. కాని, ఆ అగ్ని దహనశక్తి, తేజశ్శక్తి కోల్పోయినప్పుడు అది అగ్ని కాదు, బొగ్గుగా మారుతుంది. అదేవిధముగా చక్కెర ఉంటున్నది. ఈ చక్కెరకు తీపి స్వభావము. ఆ తీపియే ఈ చక్కెరకు లేకపోయిన తెల్లని యిసుకగా మనం భావించవచ్చును, అది చక్కెర కాదు. అదేవిధముగా ఒక్కొక్క వస్తువునకు కొన్ని క్వాలిటీస్ వుంటుంటాయి. ఆ క్వాలిటీసే దానియొక్క ధర్మము. అదేవిధముగా మానవునికి కొన్ని క్వాలిటీస్ ఉంటున్నాయి. ఆ క్వాలిటీస్ లేకపోతే వీడు మానవుడే కాదు. అదే నీతి, నిజాయితీ. ఈ సత్యము, నీతి ఈ రెండింటి చేరిక చేతనే మానవుడు మానవత్వాన్ని అనుభవిస్తూ వస్తున్నాడు.

**నీతిలేకయున్న జాతి చెడును**
**నీతిగల్గుజాతి నిజమైన జాతిరా**

మనయొక్క భారతీయ సంస్కృతికి సరైన విలువలు, ఈ నీతినిజాయితీలు. భారతీయులు ఈ రెండింటిని రెండు నేత్రములుగా భావిస్తూ వచ్చారు. కనుకనే, ప్రాచీన భారతీయ సంస్కృతి ప్రపంచ వ్యాప్తిగావించినది.

**భారతీయ సంస్కృతికి హద్దులే లేవు**

మన భారతీయ సంస్కృతి లోపల వ్యక్తిత్వాన్ని గుర్తించటం ప్రధానమైన సూత్రం. జాతీయ అభివృద్ధిని పోషించుకోడం, రెండవది. దివ్యత్వమును అనుభవించటం, మూడవది. నాల్గవది, ఐకమత్యంగా జీవించటం. ఈ నాల్గింటియొక్క చేరికయే మన భారతీయ చరిత్ర. కనుక, మన హిందూ చరిత్రను, మన హిందూమతముయొక్క చారిత్రాత్మకమైన విలువను మనం పెంచుకొనవలెనన్న మొట్టమొదట వ్యక్తిత్వాన్ని మనం గుర్తించాలి. జాతీయతను పోషించాలి. దివ్యత్వాన్ని తెలుసుకోవాలి. ఐకమత్యముతో జీవించాలి. ఇదియే పంచప్రాణ స్వరూపమైన భారతీయ సంస్కృతి. హిందు, (HINDU), అనే పదములో ఐదు అక్షరములు ఉన్నవి-హెచ్-హ్యూమానిటీ, ఐ-ఇండివిద్యుయాలిటీ,

srisathyasaivachanamrutam

ఎన్-నేషనాలిటీ, డి-డివినిటీ, యు-యూనిటీ. ఈ ఐదు ప్రాణములయొక్క స్వరూపమే నిజమైన మన భారతీయ సంస్కృతి. ఈవిధమైన ప్రధాన సూత్రములు మనం పాటిస్తూ, మన నిత్య జీవితంలో కర్తవ్యకర్మలు ఆచరిస్తూ పోవటంచేత ఈ జగత్తు ఎంత అభివృద్ధినైనా సాధించి, ఎంత సుక్షేమమునైనా అందుకోగలదు. ఈనాడు లోకములో పెద్ద కంపెనీలు ఉంటున్నాయి. మీకు తెలిసినదే. తాతా కంపనీలు ఉంటున్నాయి, బిర్లా కంపెనీలు ఉంటున్నాయి. కిర్లోస్కర్ కంపెనీలుంటున్నాయి. ఇలాంటి పెద్దపెద్ద కంపెనీలంతా వుంటున్నాయి. ఈ కంపెనీల్లో గొప్పగొప్ప ఫారెన్ యూనివర్సిటీల్లో ఎం.బి.ఎ. చేసినవారు చాలామంది ఉంటున్నారు. ఇంతమంది విద్యావంతులు, ఇంతమంది కీలకమును గుర్తించిన వ్యక్తులు వుండినప్పటికిని ఈ వ్యాపారము ఎందుకంత ఆదర్శవంతమైనదిగా కనిపించటం లేదు. కేవలము గ్రంథ పరిచయము మాత్రమే వీరియందున్నదిగాని, ఆచరణ పరిచయము లేదు. బుక్ నాలెడ్జి- ఈ దినము, రేపు నాలెడ్జి, మరునాడు ఎలర్జీ. కారణమేమనగా, వీరందరికి కేవలము అధికముగా సంపాదించాలి అనే లక్ష్యము తప్ప మరొక లక్ష్యము లేదు. వీరి తెలివితేటలను విశాలమైన రీతిలో వినియోగించుకోవడం లేదు. భారతీయ సంస్కృతికి హద్దులే లేవు. అనంతమైన రూపాన్ని ధరించినటువంటిది. ఇతరుల దుఃఖము తన దుఃఖముగా భావించే స్వభావము. ఇతరుల ఆనందమే తన ఆనందముగా విశ్వసించే స్వభావము. ఇటువంటి విశాల భావములు హృదయములో ఆవిర్భవించినప్పుడే ఏ రంగమునందు ఎలాంటి అశాంతిగాని, అలజడులుగాని లేకుండా చూచుకోవచ్చు. ఈనాడు వ్యాపార సంస్థల్లో ఏదో ఒకవిధంగా వస్తువును ఉత్పత్తిగావించి అధిక సంపత్తి చేకూర్చుకోవాలని భావిస్తున్నారు. నీతినిజాయితీలు ఏమాత్రమూ కనిపించటం లేదు. ఈ నీతినిజాయితీలు పాటిస్తే వ్యాపారము స్తంభించిపోతుందని వారికనుమానము. వర్కర్సుకు, మేనేజిమెంటుకు సన్నిహిత సంబంధము లేదు. ఎందువలన? మనుష్యత్వములోని దివ్యత్వమును వారు గుర్తించకపోవడమే దీనికి కారణము.

**మనిషి మనస్సును మేనేజ్ చేయలేనివాడు బాహ్య ప్రపంచములో ఏమి చేయగలడు?**

మేన్స్‌మైండ్ మేనేజ్ చేసేవాడే నిజమైన మేనేజరు. ఇప్పుడు మనిషియొక్క మైండ్‌ను మేనేజ్ చేయటానికే వీలులేకుండా ఉంది. దానిని చేయలేనివాడు యింక బయటి ప్రపంచములో ఏమి చేయగలడు? కేవలము బాహ్యమైన, భౌతికమైన, లౌకికమైన అభివృద్ధిని సాధించుటయందే వీరి లక్ష్యము యిమిడి ఉంటున్నాది. ఏది సమాజమునకు అనుకూలమైనది, ఏది సమాజములో సరైన వ్యక్తిత్వమును అభివృద్ధిపరుస్తుంది, ఈ వస్తువుయొక్క ప్రయోజనము ఏమిటి, దీనివల్ల జగత్తుకు ఏవిధమైన ప్రయోజనము జరుగుతున్నాది అని యేమాత్రమూ విచారించటం లేదు. ఏదో ఒక వ్యాపారము ప్రారంభించాలి, దండిగా ధనము సంపాదించాలి- ఇదే వారియొక్క లక్ష్యము. మా గ్రామము చుట్టూ ప్రత్తి పండుతున్నాది, యిక్కడ ప్రత్తి ఫ్యాక్టరీ ప్రారంభిస్తాము అని అనుకుంటాడు. ఇది కేవలము ఒక పరిమితమైన జ్ఞానమే! అక్కడ పరిసరములు విచారించాలి. వాతావరణములో నీటితడుపు వుంటేనే అక్కడ ప్రత్తి ఫ్యాక్టరీ ప్రారంభించటానికి వీలవుతుంది. అది లేకపోతే ఈ ప్రత్తినుండి దారము తీస్తున్నప్పుడు గాలికంతా తెగిపోతుంది. అదేవిధముగా వ్యాపార సంస్థలు నెలకొల్పేటప్పుడు ఆయా ప్రాంతములలోని వాతావరణమునుకూడా గుర్తించాలి. ప్రాకృతికమైన వాతావరణమేకాదు, మనుషుల మానసిక వాతావరణముకూడా! అంతేకాదు, ఫైనాన్సు, ప్రొడక్షన్, ఇలా అన్ని అంశములను పరిగణనలోనికి తీసుకోవాలి. బిజినెస్ కమ్యూనికేషన్‌కూడా మనము తీసుకోవాలి. ఎవరి దగ్గర ఏవిధముగా మాట్లాడాలి, ఏవిధముగా కరెస్పాండెన్సు చేయాలి, ఏవిధముగా వర్కర్స్ దగ్గర ప్రవర్తించాలి, ఏవిధంగా మనం మేనర్స్‌ను ప్రకటించాలి, ఇవన్నియు బిజినెస్ కమ్యూనికేషనే! ఈ కమ్యూనికేషను, ఎన్వైర్నమెంటు చాలా జాగ్రత్తగా పరిగణనలోనికి తీసుకోవాలి. ఈ విషయాన్ని ఇతర దేశములలో అంతగా పాటించటం లేదు. ఒక చిన్న ఉదాహరణము. అమెరికాలో వీడియోలలో, టి.వి. లలో, పెద్దపెద్ద స్క్రీన్‌లపై ఎడ్వర్టైజ్‌మెంట్స్ చూపిస్తారు. సమాజమునకు ఆ వస్తువులు అవసరమో కాదో అనే విచక్షణా జ్ఞానము వారికి ఉండదు. దండిగా డబ్బు రావాలి, అంతే! టెలివిజన్‌లో డ్రగ్స్ ఎడ్వర్టైజ్ చేస్తున్నారు. అంతేకాదు టాయిలెట్ పేపరు గురించి పెద్దగా ఎడ్వర్టైజ్ చేస్తారు. వారి ఉద్దేశ్యము దండిగా డబ్బు రావాలి, మిలియనేరు కావాలి; అంత వరకే! ఇది

srisathyasaivachanamrutam

సరియైనటువంటిది కాదు. ప్రజలయొక్క వినియోగము, ప్రజలయొక్క ఉపయోగమును బట్టి ఈ పదార్థముల ఉత్పత్తి జరగాలి. పెద్దపెద్ద ఫ్యాక్టరీస్ లోపల ఎన్నోవిధములైన లోపములు ఉంటూంటాయి. నీతినిజాయితీలు లేకుండా విచ్చలవిడిగా జరిగేటువంటి వ్యాపారము నేడు రేపు అభివృద్ధికావచ్చునుగాని, ఏనాటికైనా పతనాన్ని చెందుతాయి. కంపెనీ డైరెక్టర్స్‌ను మేనేజిమెంటువారు వశము చేసుకుంటారు. కావలసినంత జీతాలు యిస్తుంటారు. అప్పుడు ఈ మేనేజర్స్‌కు వారు ఒక రబ్బరు స్టాంపుగా తయారైపోతారు. వారి దోషములుగాని, వారి పరిస్థితులుగాని సరైన రీతిగా వీరు చెప్పరు. మేనేజ్‌మెంటు డిఫెక్ట్స్ ఎవరు చెబుతారో వాడే నిజమైన ఆదర్శవంతుడు. ఈనాడు కంపెనీలలో డైరెక్టర్స్ మేనేజిమెంటును పెడమార్గము పట్టించేవారు అధికముగా ఉంటున్నారు. కొన్ని ఫ్యాక్టరీలలో అసభ్యమైన రీతిలో ప్రవర్తిస్తున్నారు. ఇక్కడ కొన్నికొన్ని సొసైటీస్ అని పెట్టుకుంటారు. వీటిలో రాజకీయవేత్తలను చేర్చుకుంటారు. ఎడ్వర్టైజ్‌మెంటులో వీరికి అవకాశము అందిస్తారు. పనికిమాలిన వస్తువును పెద్దగా ఎడ్వర్టైజ్ చేస్తుంటారు. దీనివల్ల సమాజములో వాతావరణము పూర్తిగా మారిపోతుంది. వర్కర్స్ యూనియన్ అనికూడా ఉంటుంది. ఒకవిధమైన నేరోమైండ్‌తో వీరు ప్రవర్తిస్తుంటారు. యూనియన్ అంటే అర్థము మనం మొట్టమొదట గుర్తించాలి. యూనియన్ అనగా అందరూ చేరి ఉండటము. దేనిలో చేరి ఉండాలి? మంచిలో చేరి ఉండాలి. ఈనాడు అది యేమాత్రమూ కనిపించటం లేదు. ఎవరైనా ఒక వర్కరు తప్పుచేస్తే, అతనిని మేనేజరు తీసివేస్తే యూనియను వారందరూ స్ట్రైక్ ప్రారంభిస్తారు. అక్కడ మిగిలిన వర్కర్స్ దీనియొక్క పరిస్థితిని చక్కగా గుర్తించాలి. నిజముగా తప్పైతే ఆ వర్కర్‌ను దండించితీరాలి. అంతేగాని తప్పుచేసిన వర్కరుకు యూనియనే హెల్ప్‌చేస్తుంటే తప్పులు చేసేవారు ఎక్కువైపోతారు. తప్పుకు తగిన పనిష్మెంట్ వుండేతీరాలి. ఈవిధమైన పనిష్మెంట్ లేకపోతే ఈ వ్యాపారము పూర్తిగా పతనమైపోతుంది. కనుక, ఈ సూక్ష్మాన్నికూడా మనం గుర్తించుకోవాలి. కాని, ఈనాడు దీనిని గుర్తించి వర్తించే వ్యక్తులు ఎక్కడా కనిపించటం లేదు. తాము చదివేది ఒకటి, అనుసరించేది మరొకటి. మన క్లాసులలో అధ్యాపకులు ఎన్నోవిధములుగా బోధిస్తుంటారు, వాటినంతా మనం వ్రాసుకుంటాం, కాని అవి ఆచరణలో కనిపించటం లేదు. మన ఇన్‌స్టిట్యూట్ పిల్లలు దేనిని

sri sathyasai vahini amrutam

చదివినారో, ఏది సత్యమని విశ్వసించారో దానిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. నీతినిజాయతీలతో నడచుకోవాలి. విలువలను పోషించుకోవాలి.

## బ్రహ్మమందు చరించినవాడు బ్రహ్మచారి

మానవతా విలువలు అంటే ఏమిటి? దీనిని తెలుసుకుని, ఈ విలువలను క్రమేణా ఆచరణలో నిరూపించాలి. ఈ హ్యూమన్వ్యాల్యూస్ లేకపోతే మనము జీవించికూడను ప్రయోజనము లేదు. కొంతమంది హ్యూమన్వ్యాల్యూస్ అంటే మంచి నడతలని, ధర్మమని, సత్యము, శాంతి, అహింస మొదలైనవి అన్నీ కలుపుతే మానవతావిలువలు అని అనుకుంటారు. అన్నింటిలోను ప్రేమ ప్రధాన సూత్రముగా ఉంటున్నది. 'love is God, live in love', అన్నారు. ప్రేమ లేకపోతే ఈ ధర్మముగాని, సత్యముగాని, శాంతికిగాని, అహింసకుగాని విలువయే లేదు. దైవత్వముతో చేరిన గుణములుగా ఉంటుండాలి. మనము ఏ పని చేసినప్పటికిని ప్రేమతో చేయాలి. భారతీయ సంస్కృతిలో ఇంకా ఎన్నో సూత్రములు నిత్యజీవితములో ఆచరించటానికి తగిన విధముగా ఉన్నాయి. ఇంతేకాదు, మానవ జీవితమును బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్తం, సన్యాసం అని నాలుగు దశలుగా విభజిస్తూ వచ్చారు. ఈ నాలుగు భారతీయ సంస్కృతి లోపల విభాగమైనవి. అన్నింటికి బ్రహ్మచర్యము పునాది వంటిది. ఈనాటి విద్యార్థులకు అది ప్రాణసమానమైనది. ఏదైనా, ఎక్కడైనా పెడమార్గము పట్టినా అంటే, గృహస్థధర్మమే పెడమార్గము పడుతుంది. గృహస్థమే పెడమార్గము పడితే ఇంక వానప్రస్తము, సన్యాసము చెప్పనక్కరలేదు. బ్రహ్మచర్యము అనే పదమునకు అర్థమును మన సంస్కృతి చక్కగా వివరించింది. బ్రహ్మచర్యమనగా కేవలము చక్కని నడత అని మాత్రమే కాదు. కేవలము గృహస్థుడు కానివాడని చెప్పడము కాదు. అట్టి వ్యక్తి పరిశుద్ధమైన వ్యక్తి అని చెప్పడానికి వీలుకాదు. సాధారణంగా గృహస్థుడు కానివాడు బ్రహ్మచారి అనుకుంటాము మనము. ఇది చాలా తప్పు అర్థము. గృహస్థములో వుండు, వానప్రస్తములో వుండు, సన్యాసములో వుండు ఏ దశలోనైనా వుండు, బ్రహ్మలో నీవు చరించాలి, అదీ బ్రహ్మచర్యము. 'బ్రహ్మములో చరించినవాడు బ్రహ్మచారి', అన్నారు. 'సర్వం విష్ణుమయం జగత్' అనే భావముతో

srisathyasaivachanamrutam

ఉండాలి. మన హృదయములో దైవాన్ని ప్రతిష్ఠింపచేసుకుంటే ఏ కర్మలు ఆచరించినా అవి దైవకర్మలుగానే రూపొందుతాయి. కనుక, మన హృదయములో పాపభీతి, దైవప్రీతి నింపుకోవాలి. ఇదే Indian ethos and values . నిత్య జీవితములో ప్రతి కర్మ విలువైనదిగానే భావించాలి. నిత్యానిత్య విషయ పరిశీలన సల్పాలి. ఎలాంటి అనుకూలములను, ఆదాయమును యిచ్చినప్పటికిని మన మనస్సుకి తృప్తి లేకుండిన వాటిని యేమాత్రమూ అంగీకరించకూడదు. అందువలననే మన conscienceను మనం అనుసరించాలి. conscience కు తృప్తి లేకపోతే ఏమి చేసి ప్రయోజనము లేదు. నీ కాన్షియన్స్ నీ విట్‌నెస్. ఈనాడు కాన్షియన్స్‌ను లక్ష్యములో పెట్టుకొని జీవించేవారు చాలా అరుదుగా ఉంటున్నారు. సెన్సస్‌కు అతీతమైనదే కాన్షియన్స్. ఈ కాన్షియన్స్‌కు అతీతమైనదే కాన్షస్‌నెస్. ఇది సర్వత్రా వ్యాపించి ఉన్నది. అదే చైతన్యము. ఆ చైతన్యమే ఆత్మ. conscious ఇంద్రియములతో కూడినది. ఈనాడు ఇంద్రియ తృప్తి కోసమని, ఇంద్రియములు వశము చేసుకునే మార్గము కోసమని జీవిస్తున్నామేగాని, ఇంద్రియాతీతమైన తత్త్వాన్ని మనం గుర్తించటం లేదు. ఈ ఇంద్రియముల తత్త్వాన్ని తెలుసుకోవడమే మనము ధ్యానముగా భావిస్తున్నాము. ఇది నిజమైన ధ్యానము కాదు. concentration నిత్యజీవితములో భాగము. నిత్యజీవితములో ప్రధానమైన కృత్యము. ఇదంతా సెన్‌సెస్‌తో కూడినదే. ఇప్పుడు ఈ పుస్తకము నేను చదువుతున్నాను. 'వెల్‌కమ్ టు అవర్ బిలవెడ్ మాస్టర్' అనే పుస్తకం. నా చేయి ఈ పుస్తకాన్ని పట్టుకుంది. కన్నులు ఈ అక్షరాలను చూస్తున్నాయి. బుద్ధి యోచిస్తున్నాది. మనస్సు ఆలోచిస్తున్నాది. మైండ్, బుద్ధి, చేయి యివన్నీ సెన్‌సెస్. బిలో సెన్స్ వుంటేనే చదవాలి. ఈ బిలో సెన్‌సెస్ వలనే రీడింగ్, టాకింగ్, వాకింగ్ అంతా బిలో సెన్‌సెస్ స్వభావములే! కాబట్టి, బిలో సెన్‌సెస్ అనేది concentration. ఇదే లేకపోతే అక్షరాలే నాకు తెలియవు. బిలో సెన్‌సెస్‌గా వుండిన యీ concentration, మెడిటేషన్ ఎట్లా అవుతుంది? ఏబౌ సెన్సెస్ meditation; below senses, cocentration మాత్రమే! above senses కు meditation కు ఒక బోర్డర్ ఉంటున్నాది. అదే contemplation.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం**



sri sathyasai vahanamrutam

మన బుక్‌నాలెడ్జిని ఆధారము చేసుకుని మనము వ్యాపారము ప్రారంభిస్తున్నాము. కేవలము bookish knowledgeతో ఉత్తమస్థితిని పొందలేరు. అనుభవముతో దీనిని సాధించాలి. ఇది పుస్తకము. ఇది మస్తకము. ఈ పుస్తకమును మస్తకములో చేర్చినంత మాత్రమున సరిపోదు. ప్రాక్టికల్‌లో జీరో కాకుండా చూచుకోవాలి. పుస్తకములోనిది మస్తకములోనికి రావాలి. దానిని ప్రాక్టికల్‌లో దింపాలి. ఈ ప్రాక్టికల్‌లో వచ్చిన రిజల్టే నిజమైన రిజల్ట్. ఈనాడు ప్రాక్టికల్‌లో ఎవరూ సరియైన రిజల్ట్ తెచ్చుకోవడం లేదు. పుస్తకములు చదివి ఎం.బి.ఎ. డిగ్రీ సంపాయించి మన పేరు ప్రక్కన వ్రాసుకోవచ్చుగాని, దీనికి తగిన వ్యాల్యూ సంపాదించాలి. మనస్సు, బుద్ధి మరియు ఆచరణరూపమైన మార్గములో ఈ సత్యాన్ని గుర్తించాలి. ఈనాడు కంపెనీల వ్యవహారాలు నీతి బాహ్యముగా వుంటున్నాయి. కొంత కాలమువరకు ఇలా సాగిపోవచ్చును. కాని, ఏదోఒక సమయములో యివి పట్టుబడిపోతాయి. కారణము ఏమిటి? వారు చదివిన చదువుకు అనుగుణంగా వారు ప్రవర్తించటం లేదు. అదే నేను ముందు చెప్పాను. 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. ఈ మూడింటియొక్క ఏకత్వము కావాలి. మొట్టమొదట మనయొక్క విలువలను మనం పోషించుకోవాలి. మనయొక్క ప్రవర్తన చక్కగా గుర్తించుకోవాలి. ఈవిధముగా మనము ప్రవర్తించినప్పుడే మన తెలివితేటలు చక్కగా వినియోగమవుతాయి. ఈ ప్రపంచములో ప్రతి విద్యయందు కూడను బ్యాలెన్సు చాలా ముఖ్యమైనదిగా వుంటున్నాది. ఈ బ్యాలెన్సు లేకుండా ఏ చిన్న పని మనం చేయలేం. జీవితమంతా బ్యాలెన్సుపైననే ఆధారపడి వుంటున్నాది. ఈ బ్యాలెన్సును సరిగా కాపాడుతూ పోవాలి. ఎట్లా కాపాడటానికి వీలవుతుంది? మనకు తెలివితేటలు ఎక్కువగా వుంటున్నాయి. కాని, ఈ తెలివితేటలను మనం ఏమిచేస్తున్నాం? మిస్‌యూజ్ చేస్తున్నాం. పెడమార్గములో ప్రవేశపెడుతున్నాము. అనగా, ఏమిటి దీని అంతరార్థము? నాలెడ్జిని మనం కిల్‌చేస్తున్నాము. కిల్‌చేయటంవలనే బ్యాలెన్సు తప్పిపోతున్నాది. ఎప్పుడు మన నాలెడ్జిని స్కిల్‌చేస్తామో అప్పుడు బ్యాలెన్సు స్టడీగా ఉంటుంది. ఎప్పుడు బ్యాలెన్సు స్టడీగా వుంటుందో అప్పుడు ఇన్‌సైట్ (అంతర్దృష్టి)గా మారుతుంది. ఈవిధమైన తెలివితేటలను మనము ఎల్లప్పుడు పోషించుకోవాలి.

sri sathyasai vahamrutam

## ఈనాడు విశ్వాసము, ఆచరణ వేరువేరుగా ఉన్నాయి

విద్యార్థులారా! నిజంగా మన భారతీయ సంస్కృతియొక్క ప్రభావము, విలువ యిట్టిది అట్టిది అని వర్ణించుటకు వీలుకాదు. మనం చదివిన చదువు ఆచరణలో ప్రవేశపెట్టాలి. మీకందరికి తెలుసును. పూర్వ కాలములో తక్కువ చదువుకొన్నవారు పెద్దపెద్ద ఫ్యాక్టరీసు మేనేజ్ చేస్తూ వచ్చారు. ఏ చదువులు లేవు, వారికి. ఏ ఎం.బి.ఎలు లేవు. వారు చక్కగా మేనేజ్ చేస్తూ వచ్చారు. వర్కర్సుతో సన్నిహిత సంబంధము పెట్టుకునేవారు. ప్రొడక్షన్ ఎక్కువైతే బాధపడేవారు. ప్రొడక్షన్ ఎక్కువైతే వస్తువుయొక్క వ్యాల్యూ తగ్గిపోతుంది. అదే ప్రొడక్షన్ తక్కువైతే మార్కెట్ నిల్చిపోతుంది. అందువలన వారు సరైన బ్యాలెన్సుచూచుకొని వర్కర్స్‌తో పనిచేయించుకొనేవారు. అన్నింటియందు బ్యాలెన్సును చూచుకొనేవారు. వారికి ఏ చదువులుండినాయి? వారికి ప్రధానమైనవి, రెండేరెండు-పాపభీతి, దైవప్రీతి. వీటినే వారు ఆధారము చేసుకొన్నారు. ఒక్కొక్క తూరి ఏదైనా తప్పు మార్గములో అభివృద్ధిపరుస్తే ధనమును ఏదో ధర్మంగానో, ఒక సత్రముగానో, ఒక హాస్పలునో, స్కూలునో కట్టించి దానియొక్క పాప పరిహారంగా భావించేవారు. త్యాగముకూడా వుండేది వారికి. ఈనాడు అన్నివిధాలా వస్తూత్పత్తి, ధనార్జన పెంచుకుంటూపోతున్నామేగాని త్యాగమనేది ఎక్కడా కనిపించడంలేదు. ఎప్పుడూ భోగమే! ఈనాడు పెద్దపెద్ద ఆఫీసర్లు, పెద్దపెద్ద మేనేజర్లు ఉన్నారు. ఇంతమంది ఉండికూడను చక్కగా పరిశీలనచేస్తే సరిగా వున్నది ఒక్కటీ కనిపించటం లేదు. విద్యలో తెలివితేటలు పెంచుకుంటూ పోతున్నాముగాని గుణము లేకుండా పోతున్నాది. అది లేకపోవటంచేత ఈ చదువులంతా నిరర్థకమైపోతున్నాయి. కనుక, నీతినిజాయతీలను, దైవప్రీతి మరియు పాపభీతిని అభివృద్ధిపరచుకోవాలి. పాత కాలములో పాపభీతి చాలా వుండేది. కాని, ఈనాడు అది పాపప్రీతి అయిపోయింది. కనుక, ఇది సరియైన వాతావరణాన్ని దేశానికి అందించలేదు. ఇది దేశానికి కీడు తెచ్చిపెడుతుంది. ఏ విలువలను మనం విశ్వసించినామో వాటిని ఆచరణలో పెట్టాలి. కాని, ఈనాడు విశ్వసించటం వేరు, ఆచరించటం వేరుగాను కనిపిస్తున్నాది. ఇది మంచిది కాదు. మన భారతీయ సంస్కృతిలో యిలాంటి సూక్తులు యింకా ఎన్నో వుంటున్నాయి. ఒకటితో ఒకటి కూడినప్పుడు ఏ ఆకారము చెందుతుంది అని ప్రాక్టికల్‌గా నిరూపిస్తూ వచ్చారు. ఈ

sri sathyasai vachanamrutam

డిజైర్‌కూడను అనంతత్త్వము ఇన్‌ఫినిటీపైన బయలుదేరితే అదికూడను భగవత్తత్త్వంగా మారుతుంది. అనంతమైనది మనము పెంచుకోవాలి. పరిపూర్ణమైనప్పుడు అదికూడను పవిత్రమైపోతుంది. ఒక చిన్న ఉదాహరణము. ఒక బొగ్గును మనం చూస్తున్నాము. బొగ్గు నల్లగా వుంటున్నాది. దీనిని విచారణ చేయాలి. పూర్వము యిది ఒక కట్టె. కట్టెను కాల్చుటంచేత బొగ్గుగా మారింది. అయితే, ఇది ఎంతవరకు కాలటంచేత బొగ్గుగా మారింది? కొంతభాగం కాలటంచేత ఇది బొగ్గుగా మారింది. అయితే, ఈ బొగ్గును తెల్లగా చేయాలంటే మనము ఏమిచేయాలి? దీనిని పాలతో కడిగితే తెల్లగా కాదు. సబ్బుతో కడిగితో సబ్బుకూడా నల్లగా అయిపోతుంది. మరి ఇది తెల్లగా అయ్యే విధానము ఏమిటి? పూర్తి కాల్చినప్పుడు అదే తెల్లటి బూడిదగా మారిపోతుంది. దీనినే 'పూర్ణమిదః పూర్ణమదం పూర్ణాత్ పూర్ణముచ్యతే' అన్నారు. అనగా, పూర్ణముగా మనము అనుభవించేటప్పటికి యిదికూడా పూర్ణముగా మారిపోతుంది. మనము ఈనాడు పూర్ణములేదు, ప్రారంభములేదు, మిడిల్‌లో ఉంటున్నాము. న్యూట్రల్ గేరులో వుంటే బండి ముందుకూ పోదు, వెనుకకు పోదు. మనము ఈనాడు న్యూట్రల్ గేర్‌లో వుంటున్నాము. ముందుకు పోవటం లేదు, వెనుకకు రావటం లేదు. ఇటువంటి కార్లో కూర్చొనేదానికంటె దిగి నడచిపోవటం మంచిది. కనుక, మనము చదివిన దానిని ఆచరణలోనైనా పెట్టాలి, లేక అసలు చదవకుండానైనా ఉండాలి. చదువుతున్నాము, ధనమును వ్యర్థము చేస్తున్నాము. కాలమును వ్యర్థము చేస్తున్నాము. చివరకు ఆచరణలో పెట్టకుండా వుంటున్నాము. కనుక, మనము తెలుసుకున్న విషయాన్ని చక్కగా ఆచరించి, మన విద్యుక్త ధర్మాన్ని మనం నిర్వర్తించాలి.

**మానవత్వమును దివ్యత్వముగా మార్చుకోవడానికి ఎంతైనా అవకాశముంది**

ఈనాడు లోకములో ఆవరించిన అవినీతిని దూరముచేయాలనుకుంటే మన కర్తవ్యకర్మలను నిర్వర్తించాలి. అదే నిజమైన వ్యాల్యూ. శబ్దతరంగములు, విద్యుత్ తరంగములతో చేరినప్పుడు అనిత్యమైన పదార్థములుకూడను నిత్యసత్యమైన పదార్థములుగా రూపొంది మానవాతీతమైన శక్తిగా మారటానికి అవకాశము వుంటున్నాది.

sri sathyasai vahamrutam

ఢిల్లీ టెలివిజన్‌లో ఒక వ్యక్తి మాట్లాడుతున్నాడు. ఆ వ్యక్తిని, అతను మాట్లాడే మాటలను మనం ప్రశాంతినిలయంలో కూర్చుని చూడగలుగుతున్నాము, వినగలుగుతున్నాము. ఈ శబ్దతరంగములు ఆకాశమునకు అతీతమైన ఈథర్‌లో రికార్డ్ అయిపోతున్నాయి. ఆ రికార్డ్‌లో వున్నవన్నీ మనము చూడగలుగుతున్నాము. సహజమైన ప్రకృతే దానిని రికార్డ్ చేస్తున్నది. అదే ఈథర్. సామాన్యమైన మానవత్వములోనే ఒకచోట జరిగేది అనేకచోట్ల కనిపిస్తున్నప్పుడు ఆనాడు కృష్ణుడు పదహారువేలమంది గోపికల యిండ్లలో కనిపించాడంటే ఇందులో వింతేమున్నది, అని యోచన చేసుకొండి. కృష్ణునిరూపము, మృదు మధుర సంభాషణలు గోపికలయొక్క హృదయాలలోపల రికార్డ్ అయిపోయాయి. వారి భక్తిప్రపత్తులయొక్క తత్త్వము ఈవిధమైన ఏకత్వాన్ని పొందింది. వారి సంకల్పములనే శబ్దతరంగములు దివ్యత్వమైన కృష్ణతత్త్వముతో ఏకమైపోయినాయి. అదే జ్యోతిర్మయమైన ఆత్మతత్త్వము. ఆ జ్యోతిర్మయమైన తత్త్వమునే గోపికలందరు ప్రత్యక్షరూపములో చూడగలిగారు. ఒక్క కృష్ణుడు అనేక గోపికలకు అనేక యిండ్లలో ఏవిధంగా కనిపించాడు అని ప్రశ్నించటం మాత్రం మనకి తెలుస్తుంది. ఒక్క వ్యక్తి ఏ ఢిల్లీ లోపలో టెలివిజన్‌లో మాట్లాడుతూ యిందరి యిండ్లలో తాను ఎట్లా కనిపిస్తున్నాడని ప్రశ్న వేసేవారు లేరు. దీనికి యంత్రమాధారము, దానికి మంత్రమాధారము. ఇది యంత్రశక్తి, అది మంత్రశక్తి. ఇది శబ్దశక్తి, అది జ్యోతిర్‌శక్తి. ఇది ప్రకృతిశక్తి, అది పరతత్త్వశక్తి. ఈవిధమైన తత్త్వమును దివ్యత్వానికి మార్చుకోవడానికి ఎంతైనా అవకాశము ఉంటుందనే ఉద్దేశ్యముతోనే ఈ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించాను. సత్యసాయి అనే ఈ జ్యోతిర్‌శక్తి, యిక్కడుంటుండి కూడను మీ క్లాసురూములోపల కనిపించవచ్చును. క్లాసురూములో ఉండికూడను ఆడిటోరియంలో కనిపించవచ్చును. ఆడిటోరియములో ఉపన్యాసము ఇస్తున్నప్పుడు ప్రశాంతినిలయములో హారతి తీసుకోవచ్చును. ముమ్ముందు మీరు చూస్తారు. అంతవరకు మనం పోనక్కరలేదు, ఈ ఆదివారములు భారతీయసంస్కృతిని గురించి మీకు తెలిపే సమయములోపల దాన్నిగురించి తెలపటానికి ఒక ఎక్స్‌పెరిమెంటు కూడా జరుగుతుంది. చెప్పటము చాలా సులభము. దానిని అనుభవించటమే చాలా అవసరము. ఈ దివ్య తత్త్వమును మీరు అనుభవిస్తారు, ఆనందిస్తారు, జగత్తుకుకూడా పంచుతారు. మీ హృదయములు

sri sathyasai vahini

పెంచుకుంటారు. ఇదే మన ఇన్స్టిట్యూట్యొక్క ప్రధానమైన లక్ష్యము. ఆవిధమైన విశ్వాసముతో, ఆవిధమైన శ్రద్ధాభక్తులతో మీరు ఉండాలి. ఇదే 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. మీరు తెలుసుకోవలసినవి అన్నీ గ్రంథాలలో లభించేవికావు. మన హృదయ గ్రంధిలో ఉంటున్నాయి. ఈ హృదయగ్రంధియందున్నది మనము ఆవిర్భవింపచేసుకోవాలి. దానికి కాలము సమీపించినది. ఇట్టి ఆనందాన్ని అనుభవించటానికి మీరు సిద్ధంగా వుండాలి. బిజినెస్ మేనేజ్మెంట్ అనే సబ్జక్టుకు సంబంధించి గ్రంథములలో లేనివి ఎన్నో మీరు తెలుసుకోవాలి. మంచి విషయములు మీకు అర్థము కానివి త్వరలోనే అర్థమవుతాయి. బిజినెస్ మేనేజ్మెంటులో మీరు ఇతర దేశములకుకూడ ఆదర్శమును అదించటానికి తగిన కృషి చేయాలి. ఒక దేశములోని మేనేజ్మెంటు మరొక దేశానికి సరిపోదు. జపాన్ది అమెరికాకు సరిపోదు. కాని, ఇండియాలో ప్రారంభమైన మేనేజ్మెంటు అన్ని దేశములవారికి సమన్వయమవుతుంది. ఇది ఒక నూతన మతిగా మనం భావించుకోవాలి. మన భారతీయ నూతన మతియే భారతీయ సర్వజన సమ్మతముగా మారాలి. అలాంటి దానిని మీరు అభివృద్ధి పరచి, అనుభవించి, అందించే ఈ మొదటి బ్యాచ్వారు అదృష్టవంతులు. ఇలాంటి అవకాశమునకు మీరు చాలా ఎదురుచూస్తూ రావాలి. కాలమును వ్యర్థము చేయకండి. నిత్యానుభవములో మీరు సంతోషిస్తారు.

**(తేదీ 7-09-1986న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam